

# మహా మానవవాది ఎమ్.ఎన్.రాయ్

## – నరిసెట్టి ఇన్నయ్య



(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

-18-

## 22 సూత్రాలతో నవ్యమానవ వాదం

8 సంవత్సరాలపాటు భారత రాజకీయాలలో సిసింద్రీవలె ఉవ్వెత్తున అటు సిద్ధాంతపరంగానూ, ఇటు రాజకీయ ఆచరణలోనూ రాడికల్ డెమొక్రటిక్ పార్టీని ఎనిమిదేళ్ళ ప్రాయంలోనే రద్దు చేసుకున్నారు. భారత ఓటర్లు నిరాకరించినందువలన అలాంటి నిర్ణయానికి వచ్చారు. ఏమైనాసరే పార్టీని కొనసాగించాలనేవారు పక్కకు తప్పుకున్నారు. ప్రజలకు సిద్ధాంతపరంగా, ఆచరణలోను కొత్తరీతులు పాఠాలుగా చెప్పాలనే దృష్టితో ఉద్యమాన్ని కొనసాగించాలనుకున్నారు. అప్పుడే ఉద్యమంలో ప్రవేశించిన శిబ్ నారాయణ్ రే కూడా కొత్తవారికి ప్రోత్సాహాన్నిచ్చాడు. అమృతలాల్ భిక్కు షా శాస్త్రీయపద్ధతిలో పురోగమించటానికి పాఠాలు చెప్పాడు. పార్టీలో ఆరితేరిన విమద్ లాల్ తార్కుండే, గోవింద్ పరేఖ్ వంటి మేధావులు ఉద్యమంలో కొనసాగటానికి ఉద్యుక్తులయ్యారు. ఎమ్.ఎన్.రాయ్ సారథ్యంలో డెహ్రాడూన్ లో రాజకీయ పాఠశాలలు మొదలై దేశంలో అనేకచోట్ల పాఠశాలలలో వైజ్ఞానికంగా అధునాతన విద్యను కొనసాగించారు.

ఈ సూత్రాలను 1946 లో బొంబాయిలో జరిగిన రాడికల్ డెమొక్రాటిక్ పార్టీ మహాసభ చర్చించి ఆమోదించింది. వాటికి మెరుగులు దిద్ది ఎప్పటికప్పుడు వస్తున్న సైంటిఫిక్ పరిశోధనలను దృష్టిలో పెట్టుకుని చర్చిస్తూ పోయారు. 1955 లో ఎమ్.ఎన్.రాయ్ డెహ్రాడూన్ లో చనిపోయారు. ఆ తరువాత ఆయన భార్య ఎలెన్ రాయ్ బాధ్యతలను స్వీకరించి పత్రికలు, ప్రచురణలు, రాజకీయ పాఠశాలలు కొనసాగించడానికి త్వరపడ్డారు. 1960లో ఆమె హంతకుల చేతిలో హతమైన తరువాత మిగిలిన అనుచరులు ఈ బాధ్యతల్ని కొనసాగించారు.

### 22 సూత్రాలు

1. మానవుడు సమాజానికి నమూనా (Archtype). సహకార సామాజిక సంబంధాలు వ్యక్తిలోని అంతర్గత శక్తుల వికాసానికి దోహదం చేస్తాయి. వ్యక్తి వికాసమే సమాజ ప్రగతికి ప్రమాణం. సమాజ ఉనికికి వ్యక్తులే ఆధారం. వ్యక్తులు యధార్థంగా అనుభవించే స్వాతంత్ర్యమూ, సుఖజీవనాలు మాత్రమే కొలమానం. సమాజ స్వేచ్ఛ, ప్రగతీ కేవలం ఊహాకల్పితాలు, అసాధ్యాలు. వ్యక్తుల అనుభవంలోనికి వచ్చినదే యదార్థమైన

సుఖజీవనం. జాతి, వర్గం పేర్లతో మానవ సమాజానికి సమిష్టిభావం కల్పించటం తప్పు. ఆ విధంగా చేయటం వ్యక్తిని సమిష్టిభావానికి బలియడము. వ్యక్తుల సుఖజీవనమే సమిష్టి సుఖజీవనం.

2. స్వేచ్ఛాపిపాస, సత్యాన్వేషణలు మానవాభ్యున్నతికి ప్రధాన ప్రేరకాలు. స్వేచ్ఛాపిపాస అనేది, శారీరకమైన జీవితపోరాటాన్ని మానవుడు తన బుద్ధిబలంతో, ఉద్వేగంతో, ఉన్నతస్థాయిలో సాగించటమే. స్వేచ్ఛాపిపాసకు ప్రతిచ్ఛాయనే సత్యాన్వేషణ అంటే ప్రకృతిని గురించి క్రమంగా తెలుసుకునే పరిజ్ఞానం వలన ప్రకృతిశక్తుల నుండి ప్రగతి సాధించుటలో మానవునకు ఉపకరించే జ్ఞానాన్ని సత్యం అంటాము.

3. వ్యక్తిగతంగాకానీ, సమిష్టిగాగానీ జరిగే హేతుబద్ధమైన ప్రయత్నానికి లక్ష్యం ఏమంటే స్వేచ్ఛను సాధించటమే. స్వేచ్ఛ క్షణక్షణం వికాసం చెందుతుంది. సమాజంలోని భాగంగా మాత్రమేకాక మానవులుగా వారి శక్తులు పరిపూర్ణ వికాసం పొందటానికిగల ఆటంకాలను క్రమక్రమంగా తొలగించటమే స్వేచ్ఛ. సమిష్టికృషిగానీ, వ్యవస్థ కృషిగానీ ఎంతవరకు ప్రగతిశీలమూ ఎంతవరకు స్వేచ్ఛాదాయకమూ అని నిర్ణయించటానికి ఆ సమాజంలోని వ్యక్తుల ఉనికియే సాధనం. సమిష్టికృషి యొక్క విజయాన్ని అందరి వ్యక్తుల ప్రయోజనాన్ని బట్టి నిర్ణయించాలి.

4. మానవులు, నియమబద్ధమైన ప్రకృతినుండి వచ్చారు. అందుచే వారు ప్రాయికంగా హేతువాదులు. హేతుధోరణి మానవ లక్షణం. కాబట్టి ఇచ్ఛకు (will) అది విరుద్ధం కాదు. బుద్ధికుశలత, ఉద్వేగమూ (Emotion) సామాన్య మానవ లక్షణాలుగా నిరూపించవచ్చు. కాబట్టి చారిత్రక నియతివాదం సంకల్పబలానికిగల స్వేచ్ఛను కాదనలేదు. వాస్తవానికి, మానవసంకల్పమే బలీయమైన నిర్ణయకశక్తి, అలా కానిచో చరిత్రగతిలో హేతుబద్ధంగా జరిగిన విప్లవాలకు ఆస్కారం వుండేదికాదు. హేతుబద్ధమూ, శాస్త్రీయమూ ఐన ఈ నియతివాదం ప్రకృతి ప్రయోజన సిద్ధాంతమని (Teleological) గానీ, మతవాదుల కర్మసిద్ధాంతమనిగానీ భ్రమపడకూడదు.

5. భౌతికవాదాన్ని పొరపాటుగా అర్థం చేసుకొనటం వల్లనే చరిత్రను ఆర్థికశాస్త్రపరంగా నిర్వచించారు.
ఆర్థికశాస్త్ర నిర్వచనంలో ద్వైతభావం (dualism) యేర్పడింది. భౌతికవాదం, అద్వైతాన్ని (monism) ప్రతిపాదించే సిద్ధాంతం. చరిత్రగమనం నియమితమైనది, కాని ఈ గమనానికి గల కారణాలు అనేకం. అందులో మానవ సంకల్పబలం ఒకటి. మానవ సంకల్పబలానికి కేవలం ఆర్థిక అవసరాలే కారణం అని చెప్పలేము.

6. భావోత్పత్తి శరీరధర్మాలలో ఒకటి, పరిసరాల అనుభూతివల్ల భావోత్పత్తి జరుగుతుంది. ఒకమారు ఉన్నతమైన భావాలు అంతర్గత సూత్రబద్ధాలై వుంటాయి. సమాజ పరిణామమూ, భావగమనమూ పరస్పర ప్రభావానికి లోనవుతూ, సమాంతరంగా పురోగమిస్తాయి. ఐతే, మానవ పరిణామంలోని ఏదశలోనూ ప్రత్యేకించి చారిత్రక సంఘటనలకూ, భావఉద్యమాలకూ సూటియైన సంబంధాలను నెలకొల్పజాలము. సాంస్కృతిక రీతులూ, నైతిక విలువలూ కేవలం వ్యవస్థాపిత ఆర్థికసంబంధాల పునాదులపై ఏర్పడిన భావాలు కాదు. అవి కూడా నియమబద్ధమైనవే.

7. స్వేచ్ఛాయుత నవప్రపంచాన్ని సృష్టించాలంటే, సమాజ ఆర్థిక పునర్నిర్మాణస్థాయినిదాటి విప్లవం ముందుకుసాగాలి. ''పీడిత వర్గాల పేరుతో, రాజకీయాధికారాన్ని కైవసం చేసికొని, ఉత్పత్తి సాధనాల్లో, సొంతఆస్తిని రద్దుచేసినంత మాత్రాన స్వేచ్ఛ అవతరించి తీరుతుంది.'' అనుకొనటం పొరబాటు.

8. స్వేచ్ఛ మాత్రమే లక్ష్యం, ఆ లక్ష్యసాధనకు కమ్యూనిజంగానీ, సోషలిజంగానీ ఎంతవరకు ప్రయోజనకారులు అనే విషయాన్ని అనుభవం ద్వారా నిర్ణయించాలి. జాతి, వర్గం అనే ఊహామాత్ర సమిష్టి సూత్రానికి మానవుని బలిచేసే రాజకీయ విధానంగానీ, ఆర్థిక ప్రయోగంగానీ స్వేచ్ఛకు అనుకూలసాధనం కాజాలదు. స్వేచ్ఛను నిరాకరించటం ద్వారా స్వేచ్ఛను సాధిస్తామనటం అసంబద్ధమైన విషయం. ఊహాకల్పితమైన సమిష్టి భావ పూజాపీఠంమీద వ్యక్తిని బలిచేయటం స్వేచ్ఛ కాజాలదు. వ్యక్తికిగల సర్వంసహాధికారాన్ని (soverengnty) గుర్తింపక స్వేచ్ఛను నిస్సారమైన భావనగా త్రోసివేసే సాంఘికసిద్ధాంతం వల్లగానీ, సమాజ పునర్నిర్మాణ ప్రణాళికవల్లగానీ కలిగే ఫలితాలు, విప్లవ ప్రాధాన్యతలు, ప్రగతి చాల సంకుచితంగా ఉంటుంది.

9. రాజ్యం అంటే సమాజ రాజకీయ నిర్మాణం. (State). రాజ్యం అదృశ్యమౌతుందనే కమ్యూనిస్టు సిద్ధాంతం కేవలం అపోహ అని అనుభవం వల్ల తేలిపోయింది. సమాజపరమైన పరిశ్రమలతో, ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానానికి పటిష్టమైన రాజకీయ యంత్రాంగం అవసరం. ఆ యంత్రాంగం ప్రజాస్వామ్యం అదుపులోనున్నపుడే, నవసమాజంలో స్వేచ్ఛకు రక్షణ ఉంటుంది. రాజకీయ ప్రజాస్వామ్యమూ, వ్యక్తిస్వేచ్ఛా పునాదులైనప్పుడే ఉత్పత్తి వినియోగం కొరకు వుంటుంది.

10. ప్రభుత్వ (State) యాజమాన్యంగానీ, ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానంగానీ శ్రామికుల దోపిడీని ఆపవు. సంపదను సమంగా పంపిణీ చేయనూలేవు. ఆర్థిక ప్రజాస్వామ్యం లేకుంటే రాజకీయ ప్రజాస్వామ్యం అసంభవం రాజకీయ ప్రజాస్వామ్యంలేని ఆర్థికప్రజాస్వామ్యం అసంభవం.

11. నియంతృత్వం చిరస్థాయిగా ఉండటానికే ప్రయత్నిస్తుంది. సామర్థ్యమూ, సమిష్టికృషీ, సమాజ ప్రగతీ అనే సాకులతో, రాజకీయ నియంతృత్వంలో అమలుజరిగే ప్రణాళికావిధానం వ్యక్తిస్వేచ్ఛను నిర్లక్ష్యం చేస్తుంది. అందుచే సోషలిస్టు సమాజంలో, ప్రస్తుతం భావింపబడుతున్న ఉన్నతస్థాయి ప్రజాస్వామ్యం అసంభవమౌతుంది. నియంతృత్వం తన లక్ష్యాన్ని తానే నిరోధిస్తుంది.

12. అనుభవంలో లాంఛనప్రాయ ప్రజాస్వామ్యంలోని లోపాలు బయటపడ్డాయి. అధికారం దత్తం (delegate) చేసే పద్ధతే ఆ లోపాలకు కారణం. ప్రజాస్వామ్యం సమర్థంగా ఉండాలంటే సర్వధా అధికారం ప్రజలపరంగానే ఉండాలి. తమ సర్వంసహాధికారాన్ని పటుతరంగా వినియోగించుకొనటానికి, ఎప్పుడోగాక నిత్యమూ అధికారాన్ని చలాయించుకొనే సదుపాయాలను ప్రజలు ఏర్పరచుకోవాలి. అణువణువులుగా విడిపడియున్న పౌరులు కార్యాచరణలో శక్తిహీనులౌతున్నారు. తమ సర్వంసహాధికారాన్ని వినియోగించటానికీ, ప్రభుత్వయంత్రాంగంపై స్థిరమైన అజమాయిషీ చలాయించటానికి వారికి సాధనాలులేవు.

13. లాంఛనప్రాయ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉదారవాదం విపరీత వ్యాఖ్యానాలకు లోనై (liberalism) నగుబాట్లపాలైంది. స్వేచ్ఛావాణిజ్యసూత్రం (laisses faire) మనిషిని మనిషి దోచుకొనటానికి చట్టబద్ధమైన అవకాశం కల్పించింది. వ్యక్తివాదం (individualism) స్వేచ్ఛాదాయకమైనదే, కాని 'డబ్బుమనిషి' (economic man) అనే భావం ఆ గుణాన్ని పరిహసిస్తున్నది. డబ్బుమనిషి బానిసైనా ఔతాడు. బానిస యజమానియైనా ఔతాడు. మానవుని గురించిన ఈ నీచభావానికి స్వస్తిచెప్పి యదార్థమైనభావాన్ని అంటే హేతుత్వం మానవుని సహజలక్షణమని, హేతుశీలి కావటంచే అతడు నీతిపరుడు అనే భావాన్ని స్థాపించాలి. నీతి అనేది మనస్సు (conscience)కు చేసే విజ్ఞాపన, ఇక, మనస్సు అనేది అప్రయత్నంగా పరిసరాలను గుర్తించి తదనుగుణంగా వ్యవహరించే శక్తియే. కాబట్టి నీతి మానసికస్థాయిలో జరిగే యాంత్రికమైన జీవప్రవృత్తి, అందుచే అది హేతుబద్ధము.

14. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి నియంతృత్వం ప్రత్యామ్నాయం కాదు, నిర్మాణాత్మక ప్రజాస్వామ్యమే ప్రత్యామ్నాయం. అట్టి నిర్మాణాత్మక ప్రజాస్వామ్యం ఒక పిరమిడ్ స్థాయిలో ఉంటుంది. దేశవ్యాప్తంగా నిర్మింపబడిన ప్రజాసంఘాలే దానికి పునాది. శిఖరం పార్లమెంటు ఇతరస్థాయిలో ఉంటుంది. ఈ విధానంలో సమాజరాజకీయ నిర్మాణము సమాజంతో మిళితమవుతుంది. తత్ఫలితంగా రాజ్యం శాశ్వతంగా ప్రజాస్వామికపు అదుపులో ఉంటుంది.

15. మానవుడు ఆలోచనాపరుడు, వ్యక్తిగా మాత్రమే ఆలోచన చేయగలడు. ఆలోచనాపరుడైన మానవుడు తన ప్రపంచానికి తానే కర్త. ఇదే చరిత్రకు ప్రాతిపదిక. ఈ సూత్రాన్ని బలపరచటమే, విప్లవాత్మకమైన స్వేచ్ఛాదాయకమైన సిద్ధాంతాలకు కర్తవ్యం. మేథస్సు ఒక ఉత్పత్తిసాధనం. అది ఉత్పత్తిచేసే పదార్థం చాల విప్లవాత్మకం. పాతను నిర్మూలింపగల భావాలు విప్లవానికి చాల అవసరం. తమ సృజనా సామర్థ్యాన్ని గుర్తించి, ప్రపంచాన్ని మళ్ళీ నిర్మించాలనే దృఢసంకల్పం కలిగి, భావప్రగతిచే ఉత్సాహవంతులై 'స్వేచ్ఛామానవులతో స్వేచ్ఛాసమాజం' అనే ఆదర్శం గల మానవుల సంఖ్య ఇతోధికంగా పెరిగినకొలదీ ప్రజాస్వామ్యానికి అనుకూల శక్తులు ఏర్పడతాయి.

16. సామాజిక అభ్యుదయంలోని మూలసూత్రాన్ని పునరుద్ఘాటించటం మీదనే సాంఘిక విప్లవ విధానమూ, కార్యక్రమమూ ఆధారపడాలి. స్వేచ్ఛాసూత్రాలను గురించీ, హేతుబద్ధమైన సహకారవిధానాన్ని గురించీ ప్రజలకు చైతన్యం కలిగించే నిరంతరకృషి ద్వారా సాంఘిక పునరుజ్జీవనం సాధ్యమౌతుంది. అప్పుడు ప్రజలు పటిష్టమైన ప్రజాసంఘాలుగా సమీకృతులై, విప్లవానంతర వ్యవస్థకు సాంఘిక, రాజకీయ పునాదులు నిర్మింపగలుగుతారు. చైతన్యవంతులైన వ్యక్తులసంఖ్య పెరుగుతూ, ప్రజాసంఘాలు విస్తృతం కావటం సాంఘికవిప్లవానికి చాలముఖ్యం. అదేవిధంగా, స్వేచ్ఛ, హేతుత్వం, సాంఘిక సామరస్యం అనే సూత్రాలమీదనే విప్లవకార్యక్రమం ఆధారపడాలి. తత్ఫలితంగా సామాజిక జీవిత విధానంలో అన్నిరకాల గుత్తపద్ధతులు, స్వార్థశ్రేయస్సులు తొలగిపోతాయి.

17. మానవుణ్ణి మానవుడు దోచుకునే అవకాశం తొలగిపోయే విధంగా సమాజ ఆర్థికవిధానాన్ని పునర్నించటమే సమూల ప్రజాస్వామ్యానికి ప్రథమ నిబంధన. సమాజంలో సభ్యులైన వ్యక్తుల వైజ్ఞానిక కళాత్మక మానవశక్తులు వికసించటానికి వారి భౌతిక అవసరాలు అభివృద్ధికరంగా

తృప్తిపొందాలి. జీవనప్రమాణంలో క్రమాభివృద్ధికి హామీ ఇవ్వగల ఆర్థిక పునర్నిర్మాణమే సమూల ప్రజాస్వామ్యానికి పునాది. స్వేచ్ఛ అనే గమ్యంవైపు పురోగమించటానికి ఆర్థికంగా విముక్తిపొందటం అవసరం.

18. నవసమాజ ఆర్థికవిధానం రెండుసూత్రాలపై ఆధారపడి వుంటుంది. వినియోగం కొరకే వుత్పత్తి, మానవ అవసరాల ననుసరించి పంపిణీ. ఇక, నవసమాజ, రాజకీయవ్యవస్థ, ఆచరణలో వాస్తవాధికారం ప్రజలకు లేకుండాచేసే అధికారదత్త విధానంమీదగాక, ప్రజాసంఘాలద్వారా వయోజనులందరూ ప్రత్యక్షంగా జోక్యం కలిగించుకొనే విధానంపై ఆధారపడుతుంది. విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేయటంపైనే ఆ సమాజ సంస్కృతి నిలబడుతుంది. అందులో వైజ్ఞానిక, సృజనాత్మక కార్యక్రమాలమీద పెత్తనం తక్కువ. వాటికి ప్రోత్సాహమూ, అవకాశమూ ఎక్కువ. ఈ నవసమాజం శాస్త్రీయంగా హేతుత్వంపై నిర్మింపబడినందున, ప్రణాళికాబద్ధమై ఉంటుంది. ఐతే ఈ ప్రణాళిక, వ్యక్తిస్వేచ్ఛయే లక్ష్యంగా తయారౌతుంది. ఈ విధంగా రాజకీయ–ఆర్థిక– సాంస్కృతిక ప్రజాస్వామ్యమైన నవసమాజం తన్ను తానుస్వచ్ఛందంగా రక్షించుకొనగల్గుతుంది.

19. ఆధ్యాత్మిక స్వాతంత్రాన్ని సాధించి, స్వేచ్ఛాప్రపంచాన్ని సృష్టించాలనే దృఢసంకల్పంతో సన్నిహితులైన మానవుల సమిష్టి కృషిద్వారా సమూల ప్రజాస్వామ్య ఆదర్శం సాధ్యమౌతుంది. ఇట్టి మానవులు, భావి రాజ్యవ్యవస్థలో పరిపాలకులుగాగాక, ప్రజలకు మార్గదర్శకులుగా, మిత్రులుగా వుంటారు. తదనుగుణంగా, రాజకీయ ఆచరణ హేతుబద్ధమౌతుంది. అందుచే అది నీతివంతమౌతుంది. ప్రజలలో స్వేచ్ఛాసక్తి పెరిగినకొలదీ, వారికృషికి బలం చేకూరుతుంది. చివరకు, ప్రబుద్ధమైన ప్రజాభిప్రాయంపైనా, వివేకవంతమైన ప్రజాసహకారం మీదా సమూలప్రజాస్వామ్యం అమలులోనికి వస్తుంది. అధికారకేంద్రీకరణ స్వేచ్ఛకు ఆటంకమని గుర్తించటంవల్ల సమూల ప్రజాస్వామ్యవాదులు విస్తృతమైన అధికార వికేంద్రీకరణకు కృషి చేస్తారు.

20. చివరకు తేలిన సారాంశంః వ్యక్తి స్వేచ్ఛను హరించకుండా సమాజ అభ్యుదయానికి దోహదమిచ్చే విధంగా పునర్నిర్మించటానికి పౌరులను విద్యావంతులుగా చేయటం ముఖ్యఅవసరం. పౌరునిపౌర, రాజకీయ శిక్షణకు ప్రజాసంఘాలే పాఠశాలలుగా ఉపకరిస్తయ్. సమూల ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ , నిస్సంగులై తప్పుకు తిరిగే వ్యక్తులను సైతం ప్రజాహిత కార్యాలలో పాల్గొనేటట్టు చేస్తుంది. అట్టి వ్యక్తులచే నడపబడే ప్రభుత్వ యంత్రాంగం, ఒక వర్గం మరొక వర్గంపై అధికారం చెలాయించటానికి సాధనం కాదు. స్వేచ్ఛ సాధించిన వ్యక్తులు అధికారంలో ఉన్నప్పుడే దాస్యశృంఖలాలను ఛేదించి అందరికీ స్వేచ్ఛను ప్రసాదింప గలుగుతారు.

21. రాడికల్ సిద్ధాంతం శాస్త్రవిజ్ఞానాన్ని సమాజ నిర్మాణంలో అంతర్భాగంగా చేస్తుంది. వ్యక్తిత్వానికీ, సమిష్టి జీవితానికీ పొత్తు సాధిస్తుంది. స్వేచ్ఛకు నైతిక, మానసిక, సాంఘిక ప్రాధాన్యతను చేకూరుస్తుంది. ఆర్థిక నియతివాదంలోనూ, భావగమనవాదంలోనూ గల గతితార్కికాలను గమనించి సమగ్రసామాజికాభ్యుదయ సిద్ధాంతాన్ని రూపొందించింది. ఆ సిద్ధాంతం ఆధారంగానే నేడు సామాజిక విప్లవానికి అవసరమైన విధానాన్నీ, కార్యక్రమాన్నీ నిర్ణయించింది.

22. "మానవుడే అన్నిటికీ ప్రమాణం" (ప్రోటోగొరస్), "మానవజానికి మానవుడే మూలం" అనే సూక్తులనుండి 'రాడికలిజం' ఉత్పన్నమైంది. ఆధ్యాత్మికంగా విముక్తి పొందిన నీతిపరుల సమిష్టి కృషిద్వారా ప్రపంచాన్ని శ్రేయోరాజ్యంగా (Common wealth) విశ్వ సౌభ్రాతృత్వ వ్యవస్థగా పునర్నిర్మించటమే రాడికలిజం ఆశయం.

ఈ సూత్రాలను బాగా మధించి, చర్చించి ఆమోదించిన తరవాత ఉద్యమానికి ఊతం లభించింది. ఇందుకు అనుగుణంగా పత్రికలు, ప్రచురణలు తోడ్పడ్డాయి. మానవేంద్రనాథరాయ్, ఎలెన్ రాయ్, వి.యం.తార్కుండే, శిబ్ నారాయణ్ రే, జి.డి.పరేఖ్, ఆవుల గోపాలకృష్ణమూర్తి, మొదలగువారంతా స్టడీ క్యాంపులను పెట్టి దేశవ్యాప్తంగా భావ ప్రచారం చేశారు. రాడికల్ హ్యూమనిస్టు పత్రిక ఈ విషయాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తూమారుమూల వున్నవారికి విషయాలను అందించింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS